బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 15 ఫిబ్రవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా మీనాక్షి నటరాజన్

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రాంతీయంగా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కొత్త ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌ఛార్జ్‌లను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నియమించింది ఈ క్రమంలో తెలంగాణలో ప్రస్తుతం దీపాదాస్ మున్షీ ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జిగా ఉండగా.. ఆమె స్థానంలో మీనాక్షి నటరాజన్‌ను ఈ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈమేరకు కెసి వేణు గోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని పేర్కొన్నారు.

భూపేష్ బఘేల్ పంజాబ్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. డాక్టర్ సయ్యద్ నసీర్ హుస్సేన్ జమ్మూ అండ్ కాశ్మీర్, లడఖ్‌లకు జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. రజనీ పాటిల్ హిమాచల్ ప్రదేశ్ అండ్ చండీగఢ్, బి.కె. హరిప్రసాద్ హర్యానా, హరీష్ చౌదరి మధ్యప్రదేశ్, గిరీష్ చోడంకం తమిళనాడు అండ్ పుదుచ్చేరి, అజయ్ కుమార్ లల్లు ఒడిశా, కె. రాజు జార్ఖండ్, మీనాక్షి నటరాజన్ తెలంగాణ, సప్తగిరి శంకర్ ఉలక మణిపూర్, త్రిపుర, సిక్కిం అండ్ నాగాలాండ్, కృష్ణ అల్లవారు బీహార్ రాష్ట్రాలకు ఏఐసీసీ ఇన్‌చార్జిలుగా నియమితులయ్యారు.

# మోడీ బీసీ కాదు

- మోడీ తొలిసారి సీఎం అయ్యాక ఆయన కులాన్ని బీసీలో చేర్చారు
- అగ్రకులంలో పుట్టారు... అందుకే ఆయన మనసు బీసీలకు వ్యతిరేకం
- కేంద్రం జనగణనతో పాటు కులగణన చెయ్యాలి
- కులగణన సర్వేలో పాల్గొనని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లను బహిష్కరించాలి
- నేను ఆఖరి రెడ్డి సీఎం అయినా పర్వాలేదు
- కులగణన సర్వే నా కోసం చేయాలేదు
- సీఎం రేవంత్ రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పుట్టుకతో ప్రధాని మోడీ బీసీ కాదని,ఆయన లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అని సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ప్రకాశంహాల్‌లో కులగణన, ఎస్సీవర్గీకరణపై టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో ముఖ్యమంత్రి మాట్లాడారు. సర్టిఫికెట్‌లలో మోడీ బీసీ కానీ మోడీ మనసంతా బీసి వ్యతిరేకి అన్నారు. మోడీ తొలిసారి సీఎం అయ్యాకే ఆయన కులాన్ని బీసీల్లో కలిపారని చెప్పారు. అన్నీ తెలుసుకునే మోదీ కులంపై మాట్లాడుతున్నా. కేంద్రానికి సవాల్ చేస్తున్నా.. జనగణనతో పాటు కులగణన చెయ్యాలని డిమాండ్ చేశారు. కేంద్రం లెక్కలు మా ప్రభుత్వం చేసిన లెక్కలను సరిపోల్చుదాం. కులగణన సర్వేలో పాల్గొనని కేసీఆర్,కేటీఆర్,హరీష్ లను బహిష్కరణ చెయ్యాలి అన్నారు. బహిష్కరణ కోసం మీ సమక్షంలో తీర్మానం చేస్తున్న. ప్రభుత్వ సర్వే తప్పుల తడక అని చెప్పే ప్రయత్నం బీఆర్ఎస్ చేసింది. భారత్ జోడో యాత్రలోనే రాహుల్ గాంధీ స్పష్టం గా కులగణన చేస్తాం అని హామీ ఇచ్చారు. దేశంలో ఉన్న అన్ని జాతులకు వారి ఫలాలు అందాలని రాహుల్ గాంధీ ఆకాంక్షించారు.డోర్ టు డోర్ వెళ్లిన సిబ్బంది ముందే డేటా ఎంట్రీ చేశాం. కేసీఆర్ సర్వే..కాకిలెక్కల సర్వే. తెలంగాణ సమాజంలో తిరిగే హక్కే కేసీఆర్, కేటీఆర్,సంతోష్ రావ్ లకు లేదు. సమగ్ర కుటుంబ సర్వే లెక్కలు కేసీఆర్ ఇచ్చి ఉంటే మాట్లాడే హక్కు ఉండేది.కులగణన సర్వేలో డేటా ఇవ్వని లిస్టులో ముందు వరుసలో కేసీఆర్ కేటీఆర్,సంతోష్ రావ్ గ్యాంబ్లింగ్ శ్రీనివాస్‌లు ఉన్నారు.కేసీఆర్ లెక్క తేలితే..వార్డు మెంబర్ పదవి కూడా ఆ కుటుంబానికి రాదు

"నేను ఆఖరి రెడ్డి ముఖ్యమంత్రి అయినా పర్వాలేదు. మా నాయకుడు ఇచ్చిన మాట నిలబెట్టేందుకే సీఎంగా బాధ్యతలు తీసుకున్నాను. కులగణన సర్వే అనేది నా కోసం, నా పదవి కోసం చేయలేదు. త్యాగానికి సిద్ధపడి కులాల వారిగా లెక్కలు తేల్చాం. మా నాయకుడిని ఆదర్శంగా నిలబెట్టేందుకు కార్యకర్తగా మిగిలేందుకు కూడా నేను సిద్ధమే. కొందరు ఆరోపణలు చేస్తున్నట్లు కులగణన సర్వేలో ఎలాంటి లోపాలు జరగలేదు. ఇప్పుడు జరిగిన కులగణను సర్వేను తప్పుబడితే బీసీలు శాశ్వతంగా నష్టపోతారు. దేశం మొత్తం కూడా కులగణన సర్వే జరిపించాలని రాహుల్‌గాంధీ పార్లమెంటులో ప్రధాని మోదీని నిలదీశారు. ఈ సర్వే నిర్వహించకూడదని మోదీ, కేసీఆర్ కలిసికట్టుగా కుట్రకు పాల్పడుతున్నారు. కులగణన నిర్వహిస్తే చట్ట ప్రకారం రిజర్వేషన్లు సంపాదించుకోవచ్చు. అధికారిక లెక్కలు ఉంటే బీసీ రిజర్వేషన్లు పెంచాలని సుప్రీంకోర్టు కూడా తీర్పునివ్వొచ్చు. కులగణన సర్వే రెండో విడత అవకాశాన్ని వినియోగించుకోవాలి. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఇంటిముందు మేలుకోలుపు డప్పు కొట్టాలని బీసీ సంఘాలను కోరుతున్నాను. సర్వేలో పాల్గొనకపోతే సామాజిక బహిష్కరణే శిక్ష అని" సీఎం రేవంత్ అన్నారు.

**గొప్పగొప్ప నేతలు యూత్ కాంగ్రెస్ నుంచి వచ్చినవాళ్లే.**

గొప్పగొప్ప నేతలు యూత్ కాంగ్రెస్ నుంచి వచ్చినవాళ్లే. చంద్రబాబు,కేసీఆర్ కూడా యూత్ కాంగ్రెస్ నుంచి వచ్చిన వారే. యూత్ కాంగ్రెస్ శక్తి ఏంటో మాకు తెలుసు. అనిల్‌యాదవ్,బల్మూరి వెంకట్ సేవలను గుర్తించి వారికి పదవులు ఇచ్చాం. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 55వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాం. డబ్బుతో రాజకీయాలు సాధ్యాం కాదు. వచ్చే ఎన్నికల్లో ప్రజల్లో ఉన్నవారికే టికెట్లిస్తాం. ఢిల్లీ నుంచి కాదు గల్లీ నుంచి వారికే పదవులు వస్తాయి. పదేళ్ల కేసీఆర్ తప్పుడు హామీలిచ్చి ప్రజలను మోసం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అని చెప్పి కేసీఆర్ అబద్ధాలు చెప్పాడు.

లిక్కర్ కేసు ద్వారా కేసీఆర్, కేజ్రీవాల్‌ను ఓడగొట్టిన కవిత ఇప్పుడు మాట్లాడుతోంది. కేసీఆర్‌నే గట్టిగా ఓడగొట్టాం నువ్వొచ్చి చేసేదేముంది. కేసీఆర్ గట్టిగా కొడతా అంటున్నాడు. కొట్టాలనుకుంటే నీ కొడుకు కేటీఆర్‌ను పిచ్చిపిచ్చిగా కొట్టు. ఢిల్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్‌ను ఓడగొట్టినందుకు నీ అల్లుడిని కొట్టు. డబ్బుతో గెలవాలనుకుంటే కేసీఆరే గెలిచేవాడు. కేసీఆర్,కేటీఆర్, కవిత దగ్గర వేల కోట్లున్నాయి ప్రభుత్వ పథకాలను యూత్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి.ప్రజలకు అండగా ఉన్నవారికి మాత్రమే పదవులు ఇస్తాం.సామాన్యులకు పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. కష్టపడి పనిచేసిన వారికి తప్పకుండా అవకాశాలు కల్పిస్తాం. డబ్బుతో ఎన్నికల్లో గెలవడం సాధ్యం కాదు'అని రేవంత్‌రెడ్డి అన్నారు.

105 ఇంటిగ్రేటెడ్ గురుకులాల పనులు

## రెండేండ్లలో పూర్తి చేయాలి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కు సంబంధించి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. విద్యా శాఖ ఉన్నతాధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఈ స్కూళ్లకు అవసరమైన స్థలాల సేకరణ, ఇతర పనుల పురోగతిని ముఖ్యమంత్రి గారు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గాల్లో ఎక్కడైతే స్థలాల కేటాయింపు ప్రక్రియ పూర్తయిన చోట అనుమతులు, ఇతర పనులను వేగంగా చేయాలని ఆదేశించారు. ప్రతిపాదిత స్థలాలు రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు అనువుగా ఉన్నాయో లేదో ముందుగా పరిశీలించాలని సూచించారు. అనువైన స్థలం లేని చోట ప్రత్యామ్నాయ స్థలాన్ని సేకరించాలని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల కోసం జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి త్వరగా స్థలాలను గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని, దీనిపై వారం రోజుల్లో నివేదిక అందించాలని ఆదేశించారు. ఇప్పటికే స్థల సేకరణ జరిగిన నియోజకవర్గాల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలు పెట్టాలి. రెండేళ్లలో 105 నియోజకవర్గాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలతో వంద శాతం పనులు పూర్తికావాలి. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయ అభివృద్ధికి అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ విశ్వవిద్యాలయంలో భవిష్యత్తు అవసరాలకు తగినట్టుగా పూర్తి స్థాయి ప్రమాణాలతో సరైన మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు.

## గుమ్మడిదలను మరో లగచర్ల చేయెద్దు



- తక్షణమే డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు

**బలగం టీవి, మెదక్**

ఆరుగాలం పంటలు పండే పచ్చటి ప్రాంతంగా ఉన్న గుమ్మడిదలను మరో లగచర్ల చేయొద్దని, ప్రజల నెత్తిన చెత్త డంపింగ్ యార్డును తెచ్చి పెట్టొద్దని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. డంపింగ్ యార్డు ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు చేస్తున్న నిరసన దీక్షలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, చింత ప్రభాకర్, మాణిక్యరావు, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజుతో కలిసి హరీశ్‌రావు శుక్రవారం మద్దతు తెలిపారు. ప్రజలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ మద్దతుగా నిలుస్తుందని హామీ ఇస్తూ దీక్షల్లో కూర్చున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా, గుమ్మడిదల మండలంలో డంపింగ్ యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన చేస్తున్న రైతులు, స్థానికులకు మద్దతు తెలిపడం జరిగింది.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "డంపింగ్ యార్డు తెచ్చి మా నెత్తిన వేయకండి అంటే మొండిగా వ్యవహరిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. పర్యావరణం దెబ్బతింటది, నర్సాపూర్ చెరువు కలుషితం అవుతుంది, ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటాయి అనే వద్దు అంటే పట్టించుకోవడం లేదు. ఇక్కడి ప్రజల కోరిక మేరకు గతంలోనే ఈ పనులను ఆపాము. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వెళ్తున్నది. రేవంత్ రెడ్డి ఎమర్జెన్సీ లెక్క చేస్తున్నడు.. వందల మందిని ఎత్తుకొని పోయి పోలీసు స్టేషన్లలో పెడుతున్నడు. రాత్రికి రాత్రి పనులు చేసి డంపింగ్ యార్డు ఏర్పాటు చేసే కుట్ర చేస్తున్నారు ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి దుర్మార్గంగా ప్రవర్తించడం సరికాదు గుమ్మడిదల అందరికి రైతులు ఆదర్శం. బంగారం వంటి పంటలు పండిస్తారు. తక్షణమే డంపు యార్డు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

రేవంత్ రెడ్డి వచ్చాక లగచర్ల బూములు గుంజుకున్నడు. న్యాల్కల్ లో పచ్చటి పొలాలు గుంజుకునే ప్రయత్నం చేసాడు.గుమ్మడిదలను మరో లగచర్ల చేయకండని రేవంత్ రెడ్డిని హెచ్చరిస్తున్నాం. ఇందిరమ్మ రాజ్యం అన్నడు, ఇందిరమ్మ కాలం నాటి ఎమర్జెన్సీని తలపిస్తున్నడు. ఊళ్లలో మంది ఎంత మంది ఉంటే అంత మంది పోలీసులను పెట్టిండు ఓట్లేసిన పాపానికి ప్రజలను మోసం చేసినవు రుణమాఫీ, రైతు బంధు, మహాలక్ష్మి, ఇలా అన్నీ మోసమే గుమ్మడిదల రైతుల కోరిక మేరకు డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం తప్పకుండా అసెంబ్లీ వేదికగా మీ తరపున పోరాటం చేస్తాం. ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తాం. ఎయిర్ ఫోర్స్ వాళ్లు సైతం ఇక్కడ డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దని కలెక్టర్ కు ఫిర్యాదు చేసారు. అయినా పట్టించుకోవడం లేదు. టిప్పర్లు, పోలీసులను వెనక్కి తీసుకోండి. ఏర్పాటు నిర్ణయం ఉపసంహరించుకోండి. కళ్లు తెరవకుంటే తగిన శాస్తి తప్పదు, చేతిలో అధికారం ఉందని బలవంతంగా పని చేయకు. రెండు సార్లు హైకోర్టు చెప్పినా ఎందుకు పట్టించుకోవడం లేదు. హైకోర్టు ఆదేశాల మేరకు పనులు ఆపాలని, సంగారెడ్డి జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్ లను హెచ్చరిస్తున్నాం" అని అన్నారు.

## యువతకు ఉపాధి కల్పించే వనరుగా పర్యాటక శాఖ ప్రణాళికలు



- సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ప్రోత్సాహకాలు
- అటవీ, ఐటీ, టీజీఐఐసీ, మెడికల్, స్పోర్ట్స్ విభాగాలతో సమన్వయం చేసుకోవాలి
- సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రానికి ఆదాయం సమకూర్చడమే కాకుండా ఎక్కడికక్కడ యువతకు ఉపాధి కల్పించే వనరుగా పర్యాటక శాఖ ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. ఘనమైన తెలంగాణ చరిత్రను వర్తమానానికి అనుసంధానిస్తూ.. భవిష్యత్‌కు బాటలు వేసేలా పర్యాటక శాఖను తీర్చిదిద్దాలని సూచించారు.పర్యాటక శాఖ కార్యాచరణపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారుల సమావేశంలో సమీక్షించారు. పర్యాటకులను ఆకర్షించే వనరులు తెలంగాణలో ఉన్నప్పటికీ గతంలో సరైన ప్రణాళికలు అమలు చేయని కారణంగా ఆ రంగంలో ఆశించిన ప్రగతి కనిపించలేదని చెప్పారు. పర్యాటక శాఖ పాలసీకి తుది రూపు ఇచ్చే సమయంలో అటవీ, ఐటీ, విద్యుత్, టీజీఐఐసీ, వైద్య, క్రీడల శాఖలతో సమన్వయం చేసుకోవాలని, ఒక శాఖ విధానాలు మరో శాఖ విధానాలకు ఆటంకంగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి గారు అధికారులకు సూచించారు.

సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రోత్సాహకాలు కల్పించాలి. నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్‌లో బోట్ హౌస్ అందుబాటులో ఉంచాలి. డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు తెలంగాణను వేదికగా మార్చాలని సూచించారు. ఆలయాలు, పులుల అభయారణ్యాలకు పర్యాటకంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని గుర్తుచేస్తూ ఆ దిశగా దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలం, సలేశ్వరం, రామప్ప వంటి ఆలయాలు, మల్లెల తీర్థం, బొగత జలపాతాలు, బౌద్ధ స్తూపాలు, జైన ఆలయాలు ఇలా ప్రతి పర్యాటక ప్రదేశంలో వసతులు మెరుగుపర్చడంతో పాటు సరైన ప్రచారం కల్పించాలని సూచించారు.


భువనగిరి కోట రోప్ వే పనులపైనా సీఎం ఆరా తీశారు. భూ సేకరణలో కొంత జాప్యం జరిగిందని... ఇప్పుడు భూ సేకరణ పూర్తయినందున త్వరలో టెండర్లు పిలుస్తామని అధికారులు సీఎం గారికి వివరించారు. రోప్ వే పనులకు టెండర్లు పిలవడంతో పాటు కోటపై ఉన్న చారిత్రక కట్టడాల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. అడ్వెంచర్ స్పోర్ట్స్‌కు పర్యాటక శాఖలో ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం అన్నారు. వైద్య అవసరాలకు విదేశాల నుంచి వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పర్యాటకుల్లా వచ్చిపోయేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యాటక శాఖకు బడ్జెట్ కేటాయింపులు పెరిగేలా చూస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి , రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో పాటు శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సహకార సంఘాల గడువు పొడిగింపు

- పీఏసీఎస్‌ల పదవీకాలం మరో ఆరు నెలలు పెంపు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గ గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 904 సహకార సంఘాల కాలపరిమితి, 9 డీసీసీబీ చైర్మెన్ల పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పాలకవర్గ పదవీకాలానికి ఆరు నెలల ముందే ఎన్నికల ప్రక్రియ మొదలవుతుంది. ఫిబ్రవరి 15 నాటికే గడువు ముగుస్తున్నా ఇంత వరకు రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ నుంచి ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో సహకార సంఘాల పాలకవర్గ గడువును పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.



## తలసరి ఆదాయం 3.56 లక్షలు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

'దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం ఒకటి. రాష్ట్ర స్థూల ఉత్పత్తి15.02 లక్షల కోట్లు, వృద్ధిరేటు 14.5%. రాష్ట్రంలో ప్రతి వ్యక్తి తలసరి ఆదాయం 3.56 లక్షలుగా ఉంది' అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. 'అభివృద్ధి అనేది కేవలం సంఖ్యల ద్వారా మాత్రమే కాకుండా రైతులు, సూక్ష్మ , చిన్న, మధ్య తరహా పరిశ్రమలు గ్రామీణ ప్రాంతాలను ఏ విధంగా అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్తున్నాం అనేదే మెరుగైన ప్రయాణం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభివర్ణించారు. ఈ ప్రయాణంలో నాబార్డ్ కీలక భాగస్వామిగా ఉందని రాబోయే రోజుల్లో మరింత ప్రోత్సాహం అందించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు. వ్యవసాయ రంగానికి రుణ సహాయం, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. డిజిటల్ బ్యాంకింగ్ రంగాన్ని విస్తరించాలని కోరారు. నాబార్డ్ సహకారంతో రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరిగి రైతులు అనేక పంటలు పండించే స్థాయికి చేరుకున్నారని.....నీటి కొరత ఉన్న జిల్లాలను గుర్తించి నాబార్డ్ తన సహకారాన్ని మరింత విస్తరించాలని కోరారు. నీటిని ఆదా చేసే డ్రిప్పు, స్ప్రింక్లర్ల ద్వారా సాగు చేయడంతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. విపరీతమైన ఎండ ఉన్నప్పటికీ ఇజ్రాయిల్ దేశంలో అద్భుతమైన వ్యవసాయ వృద్ధిని సాధించారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

'ఎడిబుల్ ఆయిల్ దిగుమతులపై ఆధారపడకుండా ఉండడానికి మనదేశంలో లక్ష ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యంగా పెట్టుకున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగులో మలేషియా ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉందని తెలంగాణలోనూ ఆయిల్ ఫామ్ సాగును బలోపేతం చేయాలని కోరారు. మన రాష్ట్రం మామిడి, పసుపు, మిర్చి, చిరుధాన్యాలు వంటి విలువైన పంటలకు పేరుగాంచిన రాష్ట్రం. కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సహించడం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రైతులకు శిక్షణ ఇవ్వడం వంటి పనులు నాబార్డు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మహారాష్ట్రలో ఆల్ ఫోన్స్ రకం మామిడిని సాగు చేస్తున్నారు. ఇది ఎగుమతిలో ఒక మోడల్ గా ఉన్నది. మహారాష్ట్ర తరహా భూమి, ఇతర వనరులు మన రాష్ట్రంలో ఉన్న నేపథ్యంలో ఆల్ ఫోన్స్ రకం మామిడి సాగుకు రైతులను ప్రోత్సహించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు.గత పది సంవత్సరాలపాటు పాలించిన వారు రాష్ట్రంలో సైంటిఫిక్ సాగును నిర్లక్ష్యం చేశారని తిరిగి ఆ రంగం వైపు వ్యవసాయ శాఖ, నాబార్డు అధికారులు దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు.

## భారత్‌కు ఎఫ్35 యుద్ధ విమానాలు



- అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**బలగం టీవి, వాషింగ్టన్**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం భారత దేశానికి అత్యాధునిక యుద్ధ విమానాలను విక్రయించడానికి ముందుకు వచ్చారు. ప్రపంచం లోనే అగ్రశ్రేణి స్టెల్త్ ఫైటర్ జెట్లలో ఒకటైన లాక్‌హీడ్ మార్టిన్ ఎఫ్ 35 లైటెనింగ్ 2 వ రకం యుద్ధవిమానాలను భారత్‌కు అందించేందుకు సిద్ధమంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ సంవత్సరం నుంచి భారతదేశానికి మిలిటరీ ఉత్పత్తుల అమ్మకాలను అనేక బిలియన్ డాలర్లకు పెంచుతామని,భారత దేశానికి ఎఫ్ 35 స్టెల్త్ ఫైటర్లను అందించడానికి మార్గం సుగమం చేస్తున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రధాని నరేంద్రమోడీతో సంయుక్త పత్రికా సమావేశంలో పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ ట్రంప్‌తో భేటీ అయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా భారత్ అమెరికాల మధ్య వాణిజ్య, దౌత్య సంబందాలు, రక్షణ రంగంలో పరస్పర సహకారం వంటి అంశాలు వీరి చర్చల్లో చోటు చేసుకున్నాయి. ఆ తరువాత వీరిద్దరూ సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. భారత దేశ ఇంధన భద్రతను నిర్ధారించడానికి, చమురు, గ్యాస్ వాణిజ్యంపై దృష్టి పెడతామని ప్రధాని మోడీ అన్నారు 2030 నాటికి 500 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యమే మా లక్ష్యం " అని మోడీ తెలిపారు. ఈమేరకు పరస్పర ప్రయోజన కరమైన వాణిజ్య ఒప్పందం అతి త్వరలో వస్తుందని ఆశిస్తున్నారు.

## 'తెలంగాణ యోధుడు తూళ్ల దేవేందర్ గౌడ్'




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

వేలాది మంది యువకులు, విద్యార్థుల త్యాగాలు, సబ్బండ వర్ణాల మద్దతుతోనే తెలంగాణ ఉద్యమం విజయవంతమైందని, అలాంటి ఉద్యమ చరిత్రను ఏ కొందరు వ్యక్తులో తమకు అనుకూలంగా మలచుకోవాలని ప్రయత్నించినప్పుడు, నిజంగా త్యాగాలు చేసిన సిసలైన ఉద్యమకారులకు సంబంధించిన చారిత్రక వాస్తవాలను లిఖించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. సుదీర్ఘమైన తెలంగాణ ఉద్యమ చరిత్రలో ప్రజల కోణాన్ని ఆవిష్కరించిన పుస్తకం 'విజయ తెలంగాణ' అని, ఇలాంటి రచనలు మరిన్ని రావాల్సిన అవసరం ఉందని అన్నారు.మలి దశ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన తెలంగాణ యోధుడు, మాజీ మంత్రి తూళ్ల దేవేందర్ గౌడ్ గారు రచించిన 'విజయ తెలంగాణ' పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఆవిష్కరించారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ గారు, మంత్రి పొన్నం ప్రభాకర్ , రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు తో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ముఖ్యమంత్రి గారు ప్రసంగిస్తూ పలు అంశాలను ప్రస్తావించారు..

"వ్యక్తిగతంగా నేను చాలా అభిమానించే నాయకుల్లో దేవేందర్ గౌడ్ గారు అగ్రస్థానంలో ఉంటారు. విజయ తెలంగాణ వారి స్వీయ చరిత్ర కాదు. తెలంగాణ ఉద్యమ చరిత్రను ప్రజల కోణంలో పొందుపర్చిన పుస్తకం ఇది. ఉద్యమ చరిత్రను కొంత మంది తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేశారు. అందుకే తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, యువకుల త్యాగాలను చరిత్రగా లిఖించాలని మరోసారి కోరుతున్నాను. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దేవేందర్ గౌడ్ ఆ నాడు తీసుకున్న నిర్ణయాలు, చేసిన పోరాటాలు సాహ సోపేతమైనవి. గోదావరి జలాల తరలింపు కోసం దేవేందర్ గౌడ్ ఆ నాడు చేసిన పాదయాత్ర ఫలితంగానే 'ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు'కు ఆమోదం లభించింది. తెలంగాణ అంటే టీజీ అని రాయించింది దేవేందర్ గౌడ్ గారే. ఉద్యమంలో యువకులు బండ్ల పైనే కాదు, గుండెలపైనా టీజీ అని రాసుకున్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు ప్రజా ప్రభుత్వం రాగానే టీఎస్ ను టీజీ గా మార్చాం. రాష్ట్రం ఏర్పడిన పదేండ్ల తర్వాత జయ జయహే తెలంగాణ పాటను అధికారిక గీతంగా గుర్తిం చడంగానీ, తెలంగాణ ఉద్యమంలో సర్వస్వం త్యాగం చేసిన 9 మంది ఉద్యమకారులకు ఇంటి స్థలం, ఆర్థిక సహాయ ప్రకటన వంటి నిర్ణయాలు ప్రజలు కోరుకున్న విధంగానే తీసుకున్నాం. దేవేందర్ గౌడ్ లాగా విలువల తో కూడిన నాయకుల సంఖ్య తెలంగాణ రాజకీయాల్లో పెరగాల్సిన అవసరం ఉంది" అని అన్నారు.

# వడగాల్పుల నష్టాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**



వేసవి వడగాల్పుల నష్టాల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో వేసవి వడ గాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల సంబంధిత అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ రాబోయే వేసవి కాలంలో వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి లోని ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు సరిగ్గా పని చేస్తున్నాయో లేదో చెక్ చేసుకోవాలని అన్నారు.మార్చి నుంచి జూలై వరకు ఆశా కార్యకర్త నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు వరకు ప్రతి ఒక్కరి దగ్గర అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని అన్నారు . వడ గాల్పుల వల్ల వచ్చే ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల ను వివరిస్తూ ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా ఆసుపత్రిలో ఫైర్ ఆడిట్ నిర్వహించాలని అన్నారు.సమ్మర్ హీట్ వేవ్ నిర్వహణ కోసం జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలలో త్రాగునీటి సరఫరాకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో జిల్లాలో ముఖ్యమైన ప్రాంతాల వద్ద చల్లని త్రాగునీరు అందుబాటులో ఉండేలా చలి వేంద్రాల ఏర్పాటు చేయాలని అన్నారు.

వడ గాల్పుల పై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. సాంస్కృతిక సారథి కళాకారులచే ఐ.ఈ.సీ మేటిరియల్ లోని అంశాలను బస్టాండ్, మార్కెట్ వంటి ముఖ్యమైన ప్రదేశాల వద్ద ప్రచారం చేయాలని అన్నారు.వేసవి కాలంలో ప్రతి రోజు నీరు త్రాగడం, గొడుగు తీసుకుని బయటికి రావడం, వేడి గాల్పులు వచ్చే సమయంలో ఇంట్లో ఉండటం వంటి వివిధ అంశాలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు.జిల్లా అధికారుల ట్విట్టర్, ఫేస్బుక్ ఇన్స్టాగ్రామ్ అకౌంట్ , జిల్లా వెబ్ సైట్ లలో కూడా హీట్ వేవ్ నుంచి సంరక్షించేందుకు చేపట్టే జాగ్రత్తల గురించి ప్రచారం చేయాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాలలో ఉన్న టీచర్లు, కార్యకర్తల ద్వారా గ్రామాలలో ప్రచారం చేయాలని అన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి సమయాలను చేంజ్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ వో రజిత, ఇన్చార్జి డిపిఓ శేషాద్రి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి వి.శ్రీధర్, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి,మున్సిపల్ సిబ్బంది, ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది సంబంధిత ఇతర శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సబ్జెక్టులో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ ,తంగళ్లపల్లి**



విద్యార్థులంతా ప్రతి సబ్జెక్టులో ఉత్తమ ఫలితాలు సాధించేలా నిత్యం సాధన చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి సాంఘీక సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ విద్యాలయాన్ని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.కిచెన్,స్టోర్ రూంలోని బియ్యం, ఇతర ఆహార పదార్థాలను సిద్ధం చేసే సరుకుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం 6వ తరగతి నుంచి 12 వ తరగతి వరకు ప్రతి తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు.మొత్తం ఎందరు విద్యార్థులు ఉన్నారు? ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.విద్యాలయం ఆవరణ, పరిసరాలు శుభ్రం చేయించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఈ సందర్భంగా మ్యాథ్స్, బాటనీ పాఠ్యాంశాలు బోధించారు.ఆయా పాఠ్యాంశాల్లో అనుమానాలు నివృత్తి చేశారు.అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు 10 జీపీఏ సాధించేలా సన్నద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి : ఎంపీడీవో సత్తయ్య

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ రైతు వేదికలో సాధారణ ఎన్నికల సమావేశము ఎంపీడీవో సత్తయ్య నిర్వహించారు. ఎన్నికలు జరిగేటప్పుడు పకడ్బందీగా విధులు నిర్వహించాలని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణలో తెలిపారు. జెడ్పిటిసి ఎంపీటీసీ సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను పారదర్శకంగా నిర్వర్తించాలని,ఎన్నికల నియమ, నిబంధనల గురించి స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే పొరపాట్లకు ఆస్కారం ఉండదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం ద్వారా అందించిన హ్యాండ్ బుక్ (కర దీపిక) ను చదువుకుని సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణ హరి, సూపరింటెంట్ శ్రీనివాస్, వీర్నపల్లి ఎంపీడీవో ఎండి వాజిద్, ఎంపీవోలు, టిఓటి వెంకటరామిరెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# దుబాయ్‌లో నారాయణపుర్ వాసి అదృశ్యం.. వారం తర్వాత ప్రత్యక్షం

**-కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన దుబాయ్ పోలీసులు**

**-మతిస్థిమితం సరిగా లేకపోవడం వలన తప్పిపోయాడని చెబుతున్న కుటుంబ సభ్యులు**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దుబాయిలో గత వారం రోజుల క్రితం అదృశ్యం కాగా, ప్రస్తుతం దుబాయ్ పోలీసుల అదుపులో ఉన్నట్లు అక్కడి పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జెల్ల బాల శంకర్ఈనెల 6 న బతుకు తెరువు కోసం దుబాయ్ దేశం వెళ్లాడు. వెళ్లిన మరుసటి రోజు సోనాపూర్ క్యాంపు నుంచి ఉదయం పనులు చేసేందుకు రూమ్ నుంచి బయటకు వెళ్ళాడు. అప్పటినుంచి అతడు తిరిగి రాకపోవడంతో అతని ఫోటో సోషల్ మీడియాలో తప్పిపోయినట్లు ప్రచారం జరిగింది. కుటుంబ సభ్యులకు తెలియగానే అప్రమత్తమైన వెంటనే అక్కడి వ్యక్తులకు శంకర్ ఎక్కడికి వెళ్లాడు అని జడ వెతకాలని కుటుంబ సభ్యులు ప్రాధేయపడ్డారు. పూర్తి సమాచారం తెలుసుకోగా దుబాయ్ పోలీసులు అతనిని అదుపులోకి తీసుకొని మతిస్థిమితం సరిగా లేకపోవడంతో అక్కడి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఎలాగైనా సరే అతడిని ఇండియాకు పంపించాలని ప్రాధేపడుతున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడ అవ్వగానే ఇండియాకు పంపిస్తామని కుటుంబ సభ్యులకు అక్కడివారు హామీ ఇచ్చారు.


# సరైన పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లండి..

**-ఎస్పీ అఖిల్ మహాజన్**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు సందర్భాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను మరియు వివిధ సందర్భలలో సీజ్ చేయబడిన 64 వాహనాల యజమానులు 6 నెలలలోపు సరైన పత్రాలు చూపెట్టి అట్టి వాహనాలను తీసుకవేళ్ళచు అని ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్లలో పలు సందర్భాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, యజమానులు తీసుకోకుండా ఉన్న వాహనాలు,గుర్తు తెలియని 64(ఆటోలు 06, కార్స్ 03, ద్విచక్రవాహనాలు 55.)వాహనాలను జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ కి తరలించడం జరిగిందని అన్నారు.అట్టి వాహనాల యజమానులు ఆరు నెలల వ్యవధిలో సరైన ధృవ పత్రాలను చూపించి తిరిగి తీసుకోవచ్చని, ఒకవేళ వాహన యజమానులు లేనియెడల వారి కుటుంబ సభ్యులు సరైన పత్రాలు చూపెట్టి తీసుకవేళ్ళచు అని, లేని పక్షంలో ప్రభుత్వ నిబంధనలను అనుసరించి 6 నెలల తరువాత వాహనాలను వేలం వేయడం జరుగుతుంది అని అన్నారు. వాహన యజమానులు సంబంధిత పత్రాలతో ఈ రోజు నుండి ఆరు నెలల లోపు తడూర్ నందు గల పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో మోటార్ వెహిల్ సెక్షన్ నందు సంప్రదించాలని ఇతరత్రా సమాచారం కోసం 87126 56428 ,90009 10619 ఫోన్ నంబర్లలను సంప్రదించాలని తెలిపారు.



# గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను విజయవంతం చేయండి..

**-బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు**

**-వృక్షార్చన పోస్టర్ ఆవిష్కరించిన చల్మెడ**

**బలగం టీవీ , వేములవాడ**

గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు.మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం ఈ నెల 17న పురస్కరించుకొని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా వేములవాడ లో వృక్షార్చన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కే సీ ఆర్ జన్మదినం సందర్భంగా కార్యకర్తలు మూడు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని అన్నారు .రాష్ట్రం, దేశంతో పాటు సమస్త భూగోళాన్ని నివాసయోగంగా మార్చాలని సంకల్పంతో గ్రీన్ ఇండియా చాలెంజ్ నిర్వహిస్తున్నమని అన్నారు.ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటి, నాటిన మొక్కతో సెల్ఫీ దిగి 9000365000 నెంబర్ కు వాట్సప్ చేయాలని తెలిపారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ కార్యకర్తలు అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.



# బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

భారతీయ జనతా పార్టీ పట్టభద్రుల ఎ మ్మెల్సీ అభ్యర్థులైన చిన్నమెల్ల అంజిరెడ్డి, మల్క కొమురయ్య ఉపాధ్యాయులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని తంగళ్ళపల్లి మండల కేంద్రంలో ని గ్రాడ్యుయేట్ ఓటర్లని కలిసి బిజెపి బలపరిచిన అభ్యర్థులకు మొదట ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తంగళ్ళపల్లి మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి ఇటికల రాజు,పోకల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శిలివేరి ప్రశాంత్, ఎస్సీ మోర్చ కన్నె అరుణ్,ఓబీసీ మోర్చ నాగుల శ్రీనివాస్,గణేష్,మధు,రెడ్డి మల్ల ఆశీర్వాద్,కిసాన్ మోర్చా ప్రభాకర్ రెడ్డి మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



## గోదావరి జలాలకు పూజ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్పూర్ గ్రామ సమీపంలో తొమ్మిదవ ప్యాకేజీ కెనాల్ ద్వారా వస్తున్న గోదావరి జలాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పూజలు చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ తొమ్మిదవ ప్యాకేజీ కెనాల్ ద్వారా మలకపేట రిజర్వాయర్ నుండి గత మూడు రోజులుగా నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు.బాకుర్ పల్లె తండా వరకు చేరుకున్న ఈ నీటిని రైతులు వ్యవసాయ పొలాలకు వినియోగించుకొని పంటలు ఎండిపోకుండా కాపాడుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి లు చేసిన ప్రయత్నం ఫలించి సుమారు 500 ఎకరాలలో వరి పంటను కాపాడడం జరుగుతుందన్నారు. సాగునీటి పారుదల ఈ ఈ కిషోర్ తో మాట్లాడగా ఈరోజు నీటిని నిలిపివేయడం జరిగిందని దేవుని గుట్ట తండ దగ్గర జెసిపి పనులకు ఆటంకం అవడం మూలంగా నీటిని నిలిపివేశామని ఆ పనిని నీటిపారుదల శాఖ ఏఈ వెంకట్ రెడ్డి చేయిస్తున్నారనిచెప్పడం జరిగిందన్నారు.ఇదే రోజు సాయంత్రం మలకపేట రిజర్వాయర్ దగ్గర షట్టర్ లేపి నీటిని విడుదల చేస్తామని అన్నారని తెలిపారు.ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సాగునీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి మధ్య మానేరు నుండి 0.5 టిఎంసిల నీటిని మల్కపేట రిజర్వాయర్ కు పంపింగ్ చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి అని అన్నా రు. సంవత్సర కాలంలో 9వ ప్యాకేజీ కాలువ ద్వారా ఎగువమనేరుకు నీరంధించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి రైతులకు హామీ ఇవ్వడం జరిగిందన్నారు.శ్రీరామ్ సాగర్ నుండి మధ్య మానేరు ద్వారా మలకపేట రిజర్వాయర్ కు నీటిని తరలించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎస్కే సాబేరా బేగం ,వైస్ చైర్మన్ గుండాటి రామ్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి ,జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్,డైరెక్టర్లు మిండేటి శ్రీనివాస్, నారాయణ రెడ్డి, లక్ష్మారెడ్డి, తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, రవీందర్ ,సూడిద రాజేందర్, నాయకులు మేడిపల్లి దేవానంద్, ముక్క శంకర్, చెన్ని బాబు, మల్లారెడ్డి, గంగయ్య, రొడ్డ రామచంద్రం, వెంకటేష్, శ్రీకాంత్ రెడ్డి, బాలు యాదవ్ ,రమేష్, ఎల్లా గౌడ్, హైమద్ ,సోనవేని రాజయ్య, సురేష్, వెంకటరెడ్డి, నవీన్ నాయక్, అనవేని రవి, తదితరులు పాల్గొన్నారు

## నీళ్లు అందక పంటపొలాలు ఎండిపోతున్నాయి : ఎమ్మెల్సీ కవిత

**బలగం టీవీ, హైదరాబాద్**

నీళ్లు అందక పంటపొలాలు ఎండిపోతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం తాగునీరు కూడా ఇవ్వలేకపోతోందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఆలేరు, భువనగిరికి కేసీఆర్ హయాంలో కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలు, ఇంటింటికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించారని గుర్తుచేశారు . విద్యుత్ సమస్య ఉండొద్దని కేసీఆర్ ప్రభుత్వంలో జిల్లాలో పవర్ ప్లాంటు ఏర్పాటు చేశారని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కమీషన్లపై దృష్టి కేంద్రీకరించారని అన్నారు.



## బెదిరిన ఏనుగులు.. తొక్కిసలాటలో ముగ్గురు మృతి

**బలగం టీవీ, తిరువనంతపురం**

కేరళ రాష్ట్రంలోని కోజికోడ్ లోని కోయిలాండిలో అపశృతి జరిగింది. కురువంగాడ్‌లోని మణికులంగర ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఉత్సవాల కోసం ఆలయానికి పీతాంబరన్ , గోకుల్ అనే రెండు ఏనుగులను తీసుకొచ్చారు. అయితే గురువారం రాత్రి ఉత్సవం జరగుతుండగా ఆలయ ఆవరణలోనే భక్తులు బాణాసంచా పేల్చారు. టపాసుల శబ్దాలకు ఉత్సవాల కోసం తెచ్చిన ఏనుగులు బెదిరిపోయి జనంపైకి దూసుకొచ్చాయి. ఏనుగుల నుంచి తప్పించుకునేందుకు ఉత్సవాలకు వచ్చిన భక్తులు పరుగులు పెట్టారు. ఈ క్రమంలోనే ఏనుగులు ముగ్గురు భక్తులను తొక్కుకుంటూ పోయాయి. దాంతో వారు మరణించగా.. తొక్కిసలాటలో మరో 30 మందికి పైగా గాయపడ్డారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్షతగాత్రులను కోజికోడ్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. మృతులను కురువంగాడ్‌లోని వెట్టంకందికి చెందిన లీల, వడక్కైల్‌కు చెందిన అమ్ముకుట్టి, రాజన్‌గా గుర్తించారు.

# నిరుద్యోగులకు పరిశ్రమలకు వారధిగా డీఈఈటీ..

**-డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ లో విద్యార్థుల నమోదుకు చర్యలు..**

**-15 రోజులలో డీఈఈటీ యాప్ లో విద్యార్థులు నమోదయ్యేలా చర్యలు.**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**



**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**

డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీ.ఈ.ఈ.టీ) లో విద్యార్థుల వివరాల నమోదుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో డీఈఈటి యాప్ పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీ.ఈ.ఈ.టీ) ను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని, ఇందులో నమోదైతే విద్యార్థులకు ఉన్న నైపుణ్యాల అర్హత ప్రకారం ప్రైవేట్ రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాల వివరాలు తెలుస్తాయని, నిరుద్యోగులకు పరిశ్రమలకు వారధిగా ఇది పనిచేస్తుందని అన్నారు. ఐ.టి.ఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఇతర ఉపాధి కోర్సులు చదివిన విద్యార్థులు డీ.ఈ.ఈ.టి లో రిజిస్టర్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వ %డ% ప్రైవేటు రంగంలో ఉపాధి పొందే అవకాశాలు మెరుగు అవుతాయని అన్నారు.

సిరిసిల్ల జిల్లాలో ఉన్న ఐటిఐ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాసైన విద్యార్థుల వివరాలను 15 రోజులలో డీ.ఈ.ఈ.టి లో నమోదయ్యే లా చూడాలని అన్నారు. ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు , ఇతర ఉపాధి కోర్సుల కళాశాలలో, ఎంబీఏ కాలేజి విద్యార్థులు కూడా నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రైవేట్ రంగంలోనే కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసే నోటిఫికేషన్ లో అర్హత కలిగిన ఉద్యోగాల వివరాలు కూడా విద్యార్థులకు చేరవేసేందుకు డీ.ఈ.ఈ.టీ ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సమావేశంలో జి.ఎం. ఇండస్ట్రీ హనుమంతు సంబంధిత ఇతర శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 17న హైదరాబాద్‌లో నీటి సరఫరాకు అంతరాయం

**బలగం టీవీ ,హైదరాబాద్**

ఫిబ్రవరి 17 సోమవారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జలమండలి ప్రకటించింది. సోమవారం ఉదయం 6 గంటల నుంచి 24 గంటల పాటు తాగునీటి సరఫరాను అంతరాయం కలుగనుందని తిరిగి ఫిబ్రవరి 18న నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ప్రభావిత ప్రాంత ప్రజలు ముందస్తుగా ప్రత్యామ్నాయాలు చూసుకోవాలని సూచించారు.

ఎస్ఆర్‌నగర్, సనత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, బంజారాహిల్స్, వెంగల్‌రావునగర్, ఎల్లారెడ్డిగూడ, సోమాజిగూడ, ఫతేనగర్, కూకట్‌పల్లి, భాగ్యనగర్, వివేకానందనగర్, ఎల్లమ్మబండ, మూసాపేట్, భరత్‌నగర్, మోతీనగర్, గాయత్రీనగర్, బాలాజీపేట, కేపీహెచ్‌బీ, హస్మత్‌పేట్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు ప్రకటించారు. చింతల్, సుచిత్ర, జీడిమెట్ల, షాపూర్‌నగర్, గాజులరామారం, సూరారం, ఆదర్శనగర్, భగత్‌సింగ్ నగర్, జగద్గిరిగుట్ట, అల్వాల్, ఫాదర్ బాలయ్యనగర్, వెంకటాపురం, మాచబొల్లారం, డిఫెన్స్ కాలనీ, వాజ్‌పైనగర్, యాప్రాల్, చాణిక్యపురి, గౌతంనగర్, సాయినాథపురంలోనూ ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. చేర్లపల్లి, సాయిబాబానగర్, రాధిక, కొండాపూర్, డోయన్స్, మాదాపూర్‌లో కొంత భాగం, హఫీజ్‌పేట్, మియాపూర్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, తూముకుంట, జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగారం, నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్, గండిమైసమ్మ, త్రిషరామ్, తమ్మిళ్ల, ఎంఈఎస్, త్రిశూల్ లైన్స్, గన్‌రాక్, హకీంపేట్ ఎయిర్ ఫోర్స్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, ఏఐఐఎంఎస్ బీబీనగర్ ప్రాంతాల్లో కూడా తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు



**బలగం టీవీ, హైదరాబాద్**

సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి సీటు వచ్చినా.. రేవంత్ కు బుద్ధి మాత్రం పెరగలేదని విమర్శలు గుప్పించారు. పనిచేతగాక.. పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నడని ఆగ్రహం వ్యత్తం చేశారు.“తెలంగాణ సమాజంలో కేసీఆర్‌కు జీవించే హక్కు లేదని రేవంత్ అన్నారు. సమాజంలో జీవించే హక్కు ఎవరికి లేదో ప్రజలను అడుగుదామా? నీ నియోజకవర్గం కొడంగల్ లేక నీ సోంతూరు కొండారెడ్డిపల్లిలో అడుగుదామా ? రేవంత్ రెడ్డి నీకు వచ్చే ధైర్యం ఉందా? తెలంగాణ సమాజం మొత్తం రేవంత్ రెడ్డికి ఛీ కొడుతోంది. దుమ్మెత్తిపోస్తుంది. ఎలుక తోలు తెచ్చి ఎన్నాళ్ళు ఉతికినా నలుపు నలుపే కానీ తెలుపు కాదు అనే సామెతను అక్షరాల చాటుకుని రేవంత్ రెడ్డి.. తన దిగజారుడుతానాన్ని వ ు ంో వ ాా ం́ ు ప్రదర్శించారు. సీఎం పదవి లో ఉంటూ చిచోరా భాష మాట్లాడుతున్న రేవంత్ రెడ్డిని తెలంగాణ ప్రజలు ఛీ కొడుతున్నారు. రాహుల్ గాంధీ మీద నీకున్న కోపాన్ని కేసీఆర్ మీద చూపిస్తే ఎట్లా రేవంత్. ముఖ్యమంత్రిగా ఎవ్వరూ గుర్తించడం లేదని ఉనికి చాటుకోవడానికి కేసీఆర్ పై ప్రేలాపనలా?

కేసీఆర్ ను తిడితే ఒక్క రోజు హెడ్ లైన్స్ లో ఉంటావేమో కానీ తెలంగాణ చరిత్ర గతిని మార్చిన కెసీఆర్ స్థానమే ప్రజల హృదయాల్లో పదిలం అని తెలుసుకో. రేవంత్ రెడ్డి ఇదే భాషను కొనసాగించాలనుకుంటే ఆయన జనజీవన స్రవంతిలో ఉండటానికి అర్హుడు కాడు. తెలంగాణని ఆవిష్కరించిన కెసిఆర్ ను బహిష్కరిస్తావా? సూర్యుడి మీద ఉమ్మేస్తే ఏమవుతుందో తెలుసు కదా? మా బహిష్కరణ నీ వల్ల కాదు గాని, నీ నిష్క్రమణకు సమయం దగ్గర పడుతున్నది. సామాజిక బహిష్కరణ చేయాల్సివస్తే ప్రజలను పట్టపగలు మోసం చేస్తున్న నిన్ను చేయాలి రేవంత్. నాడైనా నేడైనా తెలంగాణ ద్రోహుల భాషే రేవంత్ భాష. అందుకే తెలంగాణ తెచ్చిన కేసీఆర్ ను పెద్ద చిన్న అనే గౌరవం లేకుండా దుర్భాషలాడుతున్నారు. సీఎం లేకి తనాన్ని, చిల్లర మనస్తత్వాన్ని తెలంగాణ సమాజం ఇప్పటికే అర్థం చేసుకుంది. ప్రజాస్వామ్య పంథా లోనే ప్రజలు రేవంత్ కు దిమ్మదిరిగే సమాధానం ఇస్తరు. కులగణన పేరు మీద కుటిల రాజకీయం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. నీ సర్వే సరైంది కాదని, నీ పార్టీ నాయకులే తూర్పార పడుతున్నారు. నువ్వు కులగణన చేయలేదు.. గాడిద గుడ్డు చేయలేదని నీ పార్టీ ఎమ్మెల్సీనే అంటున్నడు. సిగ్గులేకుండా నువ్వు మా గురించి మాట్లాడుతున్నావు.

నువ్వు నిజంగా సత్తా ఉన్న నాయకుడు అయితే ముందు మీ పార్టీలో ఉన్న నాయకులు అందర్నీ ఒప్పించు. కుల సర్వేలో ఖచ్చితమైన గణాంకాలు వచ్చాయని చెప్పించు. నీ కుల సర్వే ఉత్త ఎన్నికల గిమ్మిక్కే. ఫెయిల్యూర్ మ్యాజిక్కే. ఒకవైపు నీ సర్వే కరెక్ట్ అంటావు మరోవైపు రీసర్వే అంటావు. మీ ధమాకు కరాబ్ అయింది అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటది. సీఎం పదవి స్థాయిని నీ చిల్లర మాటలతో దిగజార్చకు. ప్రశాంత తెలంగాణలో ఫ్యాక్షన్ వాతావరణాన్ని సృష్టించే నీ ప్రయత్నాలు ఎప్పటికీ సఫలం కావు. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది. నీ నోరే నీ రాజకీయ జీవితానికి ఉరిగా మారబోతుంది”. అని మండిపడ్డారు.

# ఆర్సీబీ రికార్డ్ ఛేజింగ్

- **డబ్ల్యూపీఎల్ మొదటి మ్యాచ్‌లో గెలిచిన రాయల్ ఛాలెంజర్స్**
- **గుజరాత్ జెయింట్స్‌పై 6 వికెట్ల తేడాతో విజయం**



**బలగం టీవీ, హైదరాబాద్**

డబ్ల్యూపీఎల్ 2025 సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగ ళూరు(ఆర్సీబీ) శుభారంభం చేసింది. గుజరాత్ జెయింట్స్‌తో శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో రిచా ఘోష్(27 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సలతో 64 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో ఆర్సీబీ సంచలన విజయా న్నందుకుంది.

ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 201 పరుగుల భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ అష్లే గార్డ్‌నర్(37 బంతుల్లో 3 ఫోర్లు, 8 సిక్స్‌లతో 79 నాటౌట్), బెత్ మూనీ(42 బంతుల్లో 8 ఫోర్లతో 56) కూడా హాఫ్ సెంచరీలతో రాణించగా.. డియోంద్ర డాటిన్(13 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 25) మెరుపులు మెరిపించింది. ఆర్సీబీ బౌలర్లలో రేణుకా సింగ్ రెండు వికెట్లు తీయగా.. కనిక అహుజ, జార్జియ వేర్‌హమ్, ప్రేమ రావత్ తలో వికెట్ తీసారు.

అనంతరం ఆర్సీబీ 18.3 ఓవర్లలోనే 4 వికెట్లకు 202 పరుగులు చేసి గెలుపొందింది. కెప్టెన్ స్మృతి మంధాన(9), డానీ వ్యాట్(4) విఫలమైనా.. ఎల్లిస్ పెర్రీ(34 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 57), రిచా ఘోష్(27 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 64 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించి ఆర్సీబీ విజయం లో కీలక పాత్ర పోషించారు. రిచా ఘోష్‌కు అండగా కనికా అహుజా(13 బంతుల్లో 4 ఫోర్లతో 30 నాటౌట్) మెరుపులు మెరిపించింది. గుజరాత్ జెయింట్స్ బౌలర్లలో అష్లే గార్డ్‌నర్ రెండు వికెట్లు తీయగా.. డియాంద్ర డాటిన్, సయలి తలో వికెట్ తీసారు.

202 పరుగుల లక్ష్యాన్ని మరో 9 బంతులు మిగిలి ఉండగానే ఛేధించింది. దీంతో లీగ్ చరిత్రలోనే 200 పైచిలుకు లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా అవతరించింది.



## ఛాంపియన్స్ ట్రోఫీ విజేతలకు భారీ ప్రైజ్ మనీ

**బలగం టీవీ, హైదరాబాద్**

ఛాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. 2017 తర్వాత ఇప్పుడే మరోసారి ఈ టోర్నమెంట్ జరగబోతుంది. అయితే ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి ఐసీసీ భారీగా ప్రైజ్ మనీని పెంచింది. ఐసీసీ ప్రకటన ప్రకారం 2017లో జరిగిన టోర్నమెంట్‌తో పోల్చుకుంటే ఈసారి ప్రైజ్ మనీ 53 శాతం పెరిగింది. ఈ ఏడాది టోర్నమెంట్ గెలిచే జట్టుకు దాదాపు రూ. 19.50 కోట్లు లభిస్తాయని ఐసీసీ తెలిపింది. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ మొత్తానికి అంచనా వేయబడిన ప్రైజ్ మనీ 6.9 మిలియన్ అమెరికన్ డాలర్లు. అంటే మొత్తంగా దాదాపు రూ. 60 కోట్లని అర్థం. ఫైనల్లో పరాజయం ఎదుర్కొన్న జట్టు కూడా భారీ మొత్తాన్ని అందుకుంటుంది. అంటే రన్నరప్ జట్టు సుమారు 10 కోట్ల రూపాయలు దక్కించుకుంటుంది. అలాగే సెమీ–ఫైనల్స్ నుంచి నిష్క్రమించే జట్లకు సుమారు రూ. 5 కోట్ల ప్రైజ్ మనీ ఇస్తారు.

ఇక 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో 8 జట్లు 2 గ్రూపుల్లో పాల్గొంటాయి. ఇందులో ప్రతి జట్టు కనీసం మూడు మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంటుంది. గ్రూప్ దశలో విజయవంతంగా గెలిచే జట్టు ప్రతీ మ్యాచ్‌కు దాదాపు రూ. 30 లక్షల ప్రైజ్ మనీని పొందుతుంది. ఈ నేపథ్యంలో ఐదు, ఆరో స్థానంలో నిలిచే జట్లు కూడా దాదాపు రూ. 3 కోట్ల ప్రైజ్ మనీని పొందుతాయి. అదే సమయంలో 7, 8వ స్థానంలో నిలిచే జట్లకు సుమారు రూ. 1.21 కోట్లు బహుమతిగా ఇస్తారు. అలా ప్రతి జట్టు కనీసం 1 కోటి రూపాయలు ఖచ్చితంగా పొందుతుందని చెప్పవచ్చు.

## అభిమానులే నా దేవుళ్లు, నా కుటుంబం

- **మంచు మనోజ్**



**బలగం టీవీ, హైదరాబాద్**

'జగన్నాథ్' అనే మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్ కి హాజరైన సందర్భంగా నటుడు మంచు మనోజ్ కీలక వ్యాఖ్యలు చేశారు. "నాకు ఎన్ని కష్టాలు వచ్చినా, ఎంతమంది నాపై బురద చల్లాలని చూసినా, ఆ నాలుగు గోడల మధ్యకు రానీయక పోయినా మీ గుండెల్లో నుంచి మాత్రం నన్ను తీయలేరు. అభిమానులే నా దేవుళ్లు, నా కుటుంబం, నాకన్నీ. నన్ను తొక్కాలన్నా, పైకి లేపాలన్నా అది అభిమానుల చేతిలోనే ఉంది. నన్ను ఏం చేయాలన్నా అది ఫ్యాన్స్ వల్లే అవుతుంది. న్యాయం కోసం నిలబడ్డానంటే అది జరిగే వరకూ నేను ఎంత దూరమైనా వెళతాను" అని మనోజ్ అన్నారు. ఇక ఈ రోజుల్లో సినిమా తీయడం అనేది తేలికైన విషయం కాదన్నారు. రూ.కోటితో తీసినంత మాత్రాన చిన్న సినిమా కాదు, రూ. వేల కోట్లతో తీస్తే.. పెద్ద సినిమా అయిపోదన్నారు. సినిమా అంటే సినిమానే అని, బాగుందా? లేదా? అనేది ముఖ్యమన్నారు. సినిమా గొప్పది కాబట్టే తాను తల్లితో పోలుస్తుంటానన్నారు. ఓ మంచి కోసం నిలబడ్డప్పుడు న్యాయం జరిగేవరకు దాన్ని వదిలిపెట్టేది లేదు. అది బయటవాళ్లైనా సరే. నా వాళ్లయిన సరే.. న్యాయం కోసం ఎంతదూరమైనా వెళ్తాను. నేను విద్యార్థుల కోసం నిలబడ్డాను. నా ప్రాణం ఉన్నం తవరకు నిలబడతాను. ఈరోజే కాదు.. ఎప్పటికీ ఎవరూ నన్నూ ఆపలేరన్నారు.




## 'రామం రాఘవం' ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**


తమిళ దర్శకుడు, నటుడు సముద్రఖని , ధన్‌రాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'రామం రాఘవం' . ఈ సినిమాతో జబర్దస్థ్ నటుడు ధనరాజ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. స్లేట్ పెన్సిల్ స్టోరీస్ బ్యానర్ పై ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో పృథ్వీ పొలవరపు నిర్మిస్తున్నాడు. తండ్రీకొడుకుల సెంటిమెంట్ నేపథ్యంలో వస్తున్న ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే ఫస్ట్ లుక్‌తో పాటు టీజర్‌ని విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమాను ఫిబ్రవరి 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా మూవీ ట్రైలంను హీరో నాని విడుదల చేశారు. అనంతరం చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. ఈ చిత్రానికి విమానం చిత్ర దర్శకుడు శివ ప్రసాద్ యానాల కథ ను సమకూర్చగా అరుణ్ చిలువేరు సంగీతం అందిస్తున్నాడు, మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటర్. దుర్గా ప్రసాద్ కెమెరామెన్.

ట్రైలర్‌లో కొడుకు గొప్పగా సెటిలై మంచి పేరు తెచ్చుకోవాలనుకుని ఆశించే ఓ తండ్రి.. తండ్రిని అర్థం చేసుకోకుండా అప్పులు చేసుకుంటూ తిరిగే ఓ కొడుకు. ఇద్దరి మధ్య జరిగే సంఘర్షణ. కొడుకు మంచిగా సెటిల్ కాకుంటే.. ప్రతీ మిడిల్ క్లాస్ ఫ్యామిలీలో ప్రతి రోజూ జరిగే తండ్రీ కొడుకుల వార్.. కొడుకు వేస్ట్ అంటూ చెప్పే తండ్రి.. తండ్రి తనను అర్థం చేసుకోవడం లేదంటూ కోప్పడే కొడుకు. ఇలా ట్రైలర్‌లో ఎమోషన్స్ బాగా పండించారు.

## జాతీయ క్రీడల్లో తెలంగాణకు 18 మెడల్స్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఉత్తరాఖండ్ వేదికగా జరిగిన 38వ జాతీయ క్రీడలు ఘనంగా ముగిశాయి. మొత్తంగా ఈ క్రీడల్లో తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అథ్లెట్లు పతకాల పంట పండించారు. మొత్తంగా ఈ క్రీడల్లో తెలంగాణ 3 గోల్డ్ మెడల్స్, 3 రజత పతకాలు, 12 కాంస్య పతకాలను సాధించి మొత్తంగా 18 మెడల్స్ అందుకుని 26వ స్థానంతో ముగించింది. ఇక ఆంధ్రప్రదేశ్ 12 పతకాలను సాధించింది. 7 పసిడి పతకాలు, ఒక రజతం, 6 కాంస్యాలను ఖాతాలో వేసుకుని 18వ స్థానంలో నిలిచింది. ఈ నేషనల్ గేమ్స్ లో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ అగ్ర స్థానంలో నిలిచింది. 121 పతకాలను ఖాతాలో వేసుకుని తొలి స్థానంలో నిలిచింది. 68 గోల్డ్ మెడల్స్, 26 సిల్వర్ మెడల్స్, 27 బ్రాంజ్ మెడల్స్ ను సొంతం చేసుకుంది. తద్వారా ఈ క్రీడల్లో టాప్ ర్యాంకులో నిలిచింది.




## "వేరెవర్ యూ గో" సాంగ్ వచ్చేసింది

**బలగం టీవీ, హైదరాబాద్**

వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం రాబిన్ హుడ్. ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్ గా నటిస్తుంది. తాజాగా ఈ సినిమా నుంచి "వేరెవర్ యూ గో" అనే సాంగ్ ను రిలీజ్ చేశారు మేకర్స్. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రానికి జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. కాగా, ఈ సినిమా మార్చి 24న థియేటర్లలోకి రానుంది.

## కాంత నుంచి భాగ్యశ్రీ బోర్సే లుక్..




**బలగం టీవీ, హైదరాబాద్**

దుల్కన్ సల్మాన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకుడు. దీనిని రానా దగ్గుబాటి , దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. 1950 నాటి మద్రాస్ నేపథ్యంలో 'కాంత' సినిమా తెరకెక్కుతోంది. నటి భాగ్యశ్రీ బోర్సే... 'కాంత'లో సంప్రదాయ బద్ధ మైన పాత్రను చేస్తోంది. వాలెంటైన్స్ డే సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్ ను మేకర్స్ విడుదల చేశారు.

## హిందీ సరిగ్గా మాట్లాడలేకపోయా

**బలగం టీవీ, హైదరాబాద్**



హిందీ సరిగ్గా మాట్లాడలేకపోయినందున ఎన్నో సినిమా అవకాశాలను కోల్పోయా నని అందాల భామ రెజీనా కాసాంద్రా అన్నారు. శివ మనసులో శృతి' చిత్రంతో టాలీవుడ్ లోకి అడుగు పెట్టింది. 'కొత్త జంట' మూవీతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. ఆ తర్వాత వరుస అవకాశాలను అందిపుచ్చుకుని టాలీవుడ్ లో బిజీగా మారింది రెజీనా. ఇండస్ట్రీకి వచ్చి 14 ఏళ్ల తర్వాత బాలీవుడ్ లోకి అడుగుపెట్టారు నటి రెజీనా. ప్రస్తుతం ఆమె రెండు హిందీ సినిమాలో నటిస్తున్నారు. తాజా ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బాలీవుడ్ లో దక్షిణాది నటినటులు కొనసాగడం కష్టమన్నారు. బాషా రాకపోవడం వల్ల తాను ఎన్నో అవకాశాలు కోల్పోయినట్లు చెప్పారు.



### చివరి క్షణాల్లో
## ఎంఎస్ నారాయణ నన్ను చూడాలనుకున్నాడు

**బలగం టీవీ, హైదరాబాద్**

దివంగత నటుడు, కమెడియన్ ఎంఎస్ నారాయణ చివరి క్షణాల్లో తనను చూడాలనుకున్నాడని హాస్య నటుడు బ్రహ్మానందం తెలిపారు. తాజాగా ఆయన మాట్లాడుతూ.. "ఎంఎస్‌తో నాకు మంచి రిలేషన్ ఉంది. షుటింగ్ సమయాల్లో కూడా నన్ను అన్నయ్య అంటూ పిలిచేవాడు. అతడిని చూస్తే ఒక మేధావి, ఒక తెలివైన వాడు బెడ్ మీద ఉండి చావుబ్రతుకుల మధ్య పోరాడుతున్నాడు అనిపించింది. తన చివరి క్షణాలలో ఎన్నో మెదడులో తిరుగుతుంటాయి. ఎంతోమంది ప్రముఖులు తెలుసు అతడికి. బ్లడ్ రిలేషన్స్ ఉన్నారు. స్నేహితులు ఉన్నారు. కానీ, వారందరూ ఉన్నప్పటికీ చివరి క్షణాల్లో నన్ను చూడాలని అనుకున్నాడు. బెడ్‌పై ఉండి నోటితో మాట్లాడలేని కండిషన్‌లో ఉండి కూడా తన కూతురికి సైగ చేసి కాగితం అడిగి.. ఆ కాగితంలో బ్రహ్మానందం అన్నయ్యను చూడాలని ఉందని రాశాడు. దీంతో వెంటనే ఎంఎస్ కూతురు నాకు కాల్ చేసింది. నేను అప్పుడు గోపిచంద్ సినిమా షూటింగ్ శంషాబాద్ జరుగుతుంటే అక్కడ ఉన్నాను. ఈ విషయం తెలియగానే ఎవరికి చెప్పకుండా షూటింగ్ మధ్యలోనే ఆసుపత్రికి వచ్చాను. ఎంఎస్ నారాయణ నన్ను చూడగానే తన రెండు కండ్ల నుంచి కన్నీళ్లు పెట్టుకున్నాడు. నా చేయి గట్టిగా పట్టుకున్నాడు. ఆ క్షణాన్ని నేను మర్చిపోలేను. అతడిని కలిసిన తర్వాత డాక్టర్‌ని ఎంత ఖర్చు అయిన పర్వాలేదు బతికించండి అని వేడుకున్నాను. ఆ తర్వాత కుటుంబసభ్యులతో మాట్లాడి మళ్లీ షూటింగ్‌కి బయలుదేరా. ఈ మధ్య దారిలో ఉండగానే.. అతనుచనిపోయినట్లు వార్తలు వచ్చాయి" అని చెప్పారు.